క్లుప్తంగా

లక్సెట్టిపేట మున్సిపల్ సాధారణ సమావేశం



సమావేశంలో పాల్గొన్న చైర్మన్, తదితరులు

లక్సెట్టిపేట: మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య అధ్యక్షతన గురువారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. భవిష్యత్ కార్యాచరణ అంశాలపై చర్చించి ఆమోదించారు. కార్యాచరణ ఎజెండాను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ రాజశేఖర్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జన్యులోపంతో దూడ జననం



కాళ్లు లేకుండా జన్మించిన దూడ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ గ్రామంలో వింత గేదె దూడ జన్మించింది. గ్రామానికి చెందిన మేలక బాపు అనే రైతుకు చెందిన గేదె మొదటి ఈతలో మూడు రోజుల క్రితం కాళ్లు లేని దూడకు జన్మనిచ్చింది. ఆ దూడ పాకుతూ తిరుగుతోంది. ఈ కాళ్లు లేని గేదె దూడ పాకడం చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. హాజీపూర్ పశువైద్యాధికారిణి శాంతిరేఖను 'సాక్షి' సంప్రదించగా.. పశువులు కాళ్లు లేకుండా జన్మించడం ఆమెలియా అంటారని, పూర్తిగా నాలుగు కాళ్లు లేకపోతే టెట్ర ఆమెలియా అంటారన్నారు. ఇది గర్భంలో పిండం ఎదిగే సమయంలో కాళ్లు ఏర్పడటానికి దోహదపడే జన్యు లోపం కారణంగా ఇలా జరుగుతుందని వివరించారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న పోడు రైతులు

తాండూర్: పోడు భూములు కలిగిన రైతులకు పంట రుణం పొందేందుకు ఎంజాయ్‌మెంట్ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి అన్నారు. తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌కు పోడు రైతులతో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భరత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, ఉపాధ్యక్షుడు సిద్దం మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

జ్వర సర్వే సక్రమంగా చేపట్టాలి



మందులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

భీమారం: ప్రభుత్వం చేపట్టిన జ్వర సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని దాంపూర్‌లో చేపడుతున్న జ్వర సర్వేను గురువారం పరిశీలించి అనంతరం పల్లెదవాఖానాను తనిఖీ చేశారు. దవాఖానాలో మందుల స్టాక్ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుద్య పనులను పరిశీలించారు. కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న ఆంజనేయులు

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో గురువారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఐసీటీసీ కౌన్సిల్ ఆంజనేయులు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్–2024లో భాగంగా సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, టీబీ, సుఖవ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నీలిమ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ, సిబ్బంది శ్రీజ, పాల్గొన్నారు.



జైపూర్: ముదిగుంటలో శివసాయి గణేశ్ మండలి వద్ద కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



వినాయకుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో గరకతో వినాయకుని అలంకరణ



దక్షిణామూర్తి వ్రతానికి తరలివచ్చిన మహిళలు



చెన్నూర్: యూనివర్సల్ గణేశ్ మండలి వద్ద...



రూ.ఐదు లక్షల పదివేల కరెన్సీతో అలంకరణ

గణపతి బప్పా మోరియా..!

- పూజలందుకుంటున్న వినాయకుడు
- కుంకుమపూజలు నిర్వహిస్తున్న మహిళలు
- అన్నదానాలు చేస్తున్న భక్తులు

మంచిర్యాలఅర్బన్/చెన్నూర్/శ్రీరాంపూర్/జైపూర్/మందమర్రిరూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకుడు విశేష పూజలు అందుకుంటున్నాడు. మంచిర్యాల సాయికుంట బాలాజీ గణేష్ మండలి వద్ద గురువారం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్టీసీ డిపో వద్ద నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కార్మికుడు అప్పారావు కుటుంసభ్యులు అన్నదానం నిర్వహించారు. విశ్వనాథ స్వామి కాలక్షేప మండపంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దక్షిణామూర్తి వ్రతం వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, యువజన, ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి దక్షిణ మూర్తి వ్రతానికి మహిళ భక్తులు తరలివచ్చారు. అర్చకుడు నరహరిశర్మతో పాటు పలువురు పాల్గొన్నారు. చెన్నూర్ మున్సిపాలిటీలో గణేశ్ మండళ్ల వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం యూనివర్సల్, జేటీ స్ట్రీట్, లంబోధర, ఎమ్మెల్యే కాలనీ గణేశ్ మండళ్ల వద్ద నిర్వహకులు అన్నదానం చేశారు. జైపూర్ మండలం ముదిగుంటలో శివసాయి గణేశ్ మండలి వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌యాదవ్–మౌనిక దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా కమిటీ సభ్యులు దూట రాజశేఖర్, జిల్లాల శ్రీకాంత్, సోత్కు పోశం, పత్తి రాజశేఖర్, తొర్రెం భానేశ్, దూట భీమరాజ్ పాల్గొన్నారు. మందమర్రిలో ఓ భక్తుడు గణపతిని రూ.5లక్షల పది వేల (వంద, రెండు, ఐదు వందల కరెన్సీ) కరెన్సీ నోట్లతో అలంకరించారు. నిమజ్జనం రోజు వరకు రూ.10లక్షలతో అలంకరిస్తానని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



బెల్లంపల్లిలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న కార్మికులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి శాంతిఖని గని వద్ద, ఏఎంసీ ఏరియా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాలను గురువారం నిమజ్జనం చేశారు. కార్మికులు, కాంగ్రెస్ శ్రేణులు వాహనాలపై గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి శోభాయాత్ర నిర్వహించారు. గణపతి బప్పా మోరియా అంటూ పెద్దపెట్టున నినదించారు. పసుపు, కుంకుమలను చల్లుకుంటూ శోభయాత్రలో పాల్గొన్నారు. అనంతరం పోశమ్మ చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో శాంతిఖని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, రక్షణ అధికారి రాజు, ఫిట్ ఇంజనీర్ విద్యాసాగర్, బీఎం ఇన్‌చార్జి ముస్తాఫా, అధికారులు పూర్ణచందర్, ప్రవీణ్, రాంసాగర్, సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు మత్తమారి సూరిబాబు, మునిమంద రమేష్, దావ రమేష్, బత్తుల సుదర్శన్, నర్సింగరావు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గుడిపేట గురుకుల గణేశ్ నిమజ్జనం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట మహాత్మ జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలో నెలకొల్పిన గణేశ్ మండలి నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల ఆనందోత్సహాల మధ్య నృత్యం చేస్తూ గణనాథుడిని శోభాయాత్రగా గోదావరికి తరలించారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో నిమజ్జనం చేశారు. వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ శేరు శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుడిపేటలో ఎంజేపీ గణనాథుడి ఎదుట నృత్యం

కూరగాయల స్టాల్స్ డిపాజిట్ తగ్గింపు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కూరగాయల మార్కెట్లో వ్యాపారులకు కేటాయించిన స్టాల్స్ డిపాజిట్, అద్దెను తగ్గిస్తూ మున్సిపల్ తీర్మానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన గురువారం అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూరగాయల మార్కెట్ స్టాల్స్ డిపాజిట్, అద్దె గురించి చర్చించారు. స్టాల్స్ దక్కించుకున్న వ్యాపారులు మున్సిపాలిటీకి ఇదివరకు నిర్ణయించిన డిపాజిట్, అద్దెను చెల్లించడానికి ముందుకు రాకపోవడంతో తాజాగా సవరించారు. గతంలో ఒక్కోస్టాల్ డిపాజిట్ రూ.20వేలు, నెలవారీ కిరాయి రూ.2వేలు చొప్పున నిర్ణయించగా ప్రస్తుతం ఆ డిపాజిట్‌ను రూ.10వేలకు కుదించి నెలవారీ అద్దె రూ.2వేలు యధావిధిగా ఖరారు చేశారు. ఈ మేరకు సభ్యులు తీర్మానం చేశారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్, పక్కన కమిషనర్

కూరగాయల వ్యాపారులు సవరించిన స్టాల్స్ డిపాజిట్‌ను ఈ నెల 16వ తేదీ లోపు మున్సిపాలిటీకి చెల్లించాలని, లేకపోతే ఆ వ్యాపారుల స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

ఊర చెరువు అక్రమ నిర్మాణాలు తొలగించాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రికి వెళ్లే దారి పక్కన ఉన్నటువంటి ఊర చెరువు ఆక్రమణకు గురై అక్రమ నిర్మాణాలు వెలిసాయని, వాటిని గుర్తించి వెంటనే తొలగించాలని బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఊర చెరువు ఎఫ్‌టీఎల్‌ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేసి, అక్రమ నిర్మాణాలను తొలగించాలని, లేకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట రాయలింగు, శ్రీనివాస్, విశ్వనాథం ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజేంద్రప్రసాద్

లాభాల వాటా సమానంగా పంచాలని వినతి

శ్రీరాంపూర్: భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికులతో సమానంగా ఓసీపీలో పనిచేసే కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలని యూనియన్ల నాయకులు కోరారు. సీఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపూర్ ఓసీపీలో అన్ని కార్మిక సంఘాల నేతలు మేనేజర్ బ్రహ్మాజీని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఫిట్ సెక్రెటరీ శ్రీపతి బానేశ్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ మోతె లచ్చన్న, ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రెటరీ జాన్సన్, హెచ్‌ఎమ్మెస్ నాయకులు జీవన్ జోయల్, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ శంకర్, బీఎంఎస్ ఫిట్ సెక్రెటరీ నీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఓసీపీ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఐకే1ఏ గనిపై శ్రీనివాస్‌కు నివాళ్లు

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిలో విధి నిర్వహణలో మరణించిన ఎలవేణి శ్రీనివాస్‌కు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, యూనియన్ నాయకులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సారయ్య, గుర్తింపు సంఘం ఫిట్ కార్యదర్శి నవీన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఫిట్ కార్యదర్శి రామ్‌చందర్, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి అంబాల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి గడ్డం మల్లన్న, బీఎంఎస్ ఫిట్ కార్యదర్శి లక్ష్మణ్, అధికారులు నాగరాజు, రాజేశ్, రాకేశ్, కార్మికులు పాల్గొన్నారు.

అప్రెంటిషిప్ కోసం ఆహ్వానం

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థలో ఏడాది కాలానికి అప్రెంటిషిప్ చేయడానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులై నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగిన వారు, ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మందమర్రిరూరల్: వివిధ ట్రేడ్‌లలోని ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి అప్రెంటిషిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి పేర్లను నమోదు చేసుకునేందుకు ఏరియాలోని ఎంవీటీసీలో దరకాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో గురువారం రాపల్లి, గుడిపేట గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలకు స్పందన లభించింది. అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి పరీక్షలు చేసుకోగా, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి లహరి, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీవో మధుసూధన్, డీఎల్‌పీఓ ధర్మారాణి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు తనిఖీ

భీమారం: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ద్వారా చేపట్టిన పారిశుధ్య పనులను జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి కల్పన తనిఖీ చేశారు. వీధుల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి ఉన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

భీమారం/మందమర్రిరూరల్: గణేశ్ నిమజ్జనాన్ని నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకోవాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, భీమారం ఎస్సై రాములు, తహసీల్దార్ సదానందం సూచించారు. గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. శోభాయాత్రలు అర్ధరాత్రి వరకు కాకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదని చెప్పారు.

■ బొగ్గుబాయి వార్తలు

డిస్పెన్సరీలను మెరుగుపర్చాలి

శ్రీరాంపూర్: కంపెనీ డిస్పెన్సరీలను మెరుగుపర్చాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ సెంట్రల్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు పానుగంటి సత్తయ్య, పాగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. శ్రీరాంపూర్‌లో రెండు డిస్పెన్సరీలు ఉన్న వీటి ద్వారా అత్యవసర సమయంలో సరైన చికిత్స అందడం లేదన్నారు. కోట్ల లాభాలు గడిస్తున్న కంపెనీ ఉద్యోగుల ప్రాణాలకోసం సరైన చర్యలు తీసుకోవాలన్నారు. దీని కోసం ఇక్కడి ఏదేని ఒక డిస్పెన్సరీని 50పడకల ఆసుపత్రిగా మార్చాలని డిమాండ్ చేశారు. అప్పుడే కార్మికుల ప్రాణాలు నిలుస్తాయన్నారు.

త్వరలో సీఎంపీఎఫ్ చీటీల పంపిణీ

శ్రీరాంపూర్: గడిచిన ఆర్థిక సంవత్సరం 2022–23కు సంబంధించిన సీఎంపీఎఫ్ చీటీలను త్వరలో పంపిణీ చేయబోతున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9369మంది ఉద్యోగులకు సీఎంపీఎఫ్ ఆడిట్ షీట్‌లను అన్ని గనుల మేనేజర్ కార్యాలయాలకు, డిపార్టుమెంట్లకు పంపిణీ చేశామన్నారు.

హోమియోపతి మందులతో మెరుగైన ఆరోగ్యం

- జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలటౌన్: హోమియోపతి మందులతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని, మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో గురువారం అంజనీపుత్ర రియల్‌ఎస్టేట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ కేర్ హోమియోపతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, యాంటీ ఇన్‌ఫెక్షన్ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వయస్సు నిమిత్తం లేకుండా అన్ని వయస్సుల ప్రజలు హోమియోపతి మందులు వినియోగించవచ్చన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. హోమియోపతి వైద్యంలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంజనీపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి, డైరెక్టర్లు గుర్రాల సురేష్, కొయ్యడ శ్రీనివాస్, కుమార్, డాక్టర్ కేర్ హోమియోపతి వైద్యుడు మల్లేష్, మేనేజర్ రజిత, శంకర్‌సింగ్, గీత, నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

నేర నిరూపణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్

బెల్లంపల్లి: నేల నిరూపణలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మోటారు బైక్ షోరూమ్ యాజమానుల సహకారంతో గురువారం కాల్‌టెక్స్ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో సీసీ కెమెరాల అవసరాలు ఎంతగానో ఉన్నాయన్నారు. సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి కేసులు నమోదు కావడం లేదని తెలిపారు. ఏ చిన్న ఘటన చోటు చేసుకున్నా, సీసీ కెమెరాల ద్వారా తెలుసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. అవసరమైన ప్రతిచోట, ప్రతిబస్తీలో ప్రజలు, వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దిన్, టూటౌన్ ఎస్సై మహేందర్, మోటారు బైక్ షోరూమ్‌ల నిర్వాహకులు, పురప్రజలు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఏసీపీ

దరఖాస్తుల స్వీకరణ

బెల్లంపల్లిరూరల్/కాసిపేట: విద్యుత్ మీటర్ లేని గ్రామీణులు తప్పనిసరిగా నూతన విద్యుత్ మీటర్లు తీసుకోవాలని విద్యుత్ శాఖ జిల్లా ఎస్.ఈ శ్రావణ్ కుమార్ అన్నారు. బెల్లంపల్లి మండలం బుధాకలాన్‌లో, కాసిపేట మండలంలోని సాలెగూడ ఆదివాసీ గ్రామంలో గురువారం విద్యుత్ మీటర్ లేని వారికి రూ.938కే నూతన విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 17 నుంచి ప్రజాపాలన కార్యక్రమం మరోసారి చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యుత్ మీటర్లు లేని గ్రామీణులు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలోని కానీ, అధికారులను కానీ సంప్రదించి నూతన విద్యుత్ మీటర్ కనెక్షన్‌లు పొందాలన్నారు. విద్యుత్ శాఖ బెల్లంపల్లి డీ.ఈ రాజన్న, బెల్లంపల్లిరూరల్, బెల్లంపల్లి టౌన్ ఏ.ఈలు రామ్ మనోహర్, శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ రాజు,కాసిపేట ఏఈ స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్: అంగన్‌వాడీ సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపారాణి అన్నారు. తాండూర్ మండలం గోపాల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ భీ–పడాయి భీ కార్యక్రమాన్ని చేపట్టారు.